# వ్యాస కౌముది



## శతకకవులు అనుకరణలు-అనుసరణలు

### -కుంతి

**శతకసాహిత్యమును పరిశీలిస్తే** శతక కవులపై ప్రముఖ కవుల ప్రభావము ఉన్నట్లుగా కనిపిస్తుంది. కొందరు కవులు తమ కన్నా ప్రాచీన కవుల భావాలను తమ శతకాలలో వాడుకున్నారు. శతక కవులలో భక్తి తత్వము వ్రాసినవారు తప్పక పోతనను అనుకరిస్తే ,నీతి శతకాలను వ్రాసినవారు రామాయణ, మహాభారతాలలో చెప్పబడిన ధర్మసూక్ష్మాలను, నీతులను అనుసరించినట్లు, అనుకరించినట్లు గోచరిస్తుంది. శతకకారులు వివిధ సందర్భాలలో ప్రముఖ కవుల మార్గమును ఎంచుకున్నట్లు తెలుస్తుంది. అయితే శతకారులు మిగితా ప్రాచీన కవులతో పోలిస్తే పోతనను బాగా అనుసరించారు. పోతనను శతకకారులు యేవిధంగా అనుసరించారో నేను ప్రత్యేకముగా మరొక వ్యాసములో వివరించాను. ఈ వ్యాసమునందు ముఖ్యంగా శతకకారులు ఇతరులను, ఇతరులు శతకకారులు ఎలా అనుసరించాలో తెలిపే ప్రయత్నము చేస్తున్నాను.

***<u>శతకకారులు-ప్రముఖులు</u>***

మహాభారతము నందు జనమేజయుడికి పరిక్షిత్ వృత్తాంతము నెరిగించు సందర్భమున శమీకుడు శృంగితో అన్నమాటలు,

క్రోధము తపముంజెరుచును __క్రోధమ యణిమాదులై గుణముల బాపుం
గ్రోధమధర్మక్రియలకు, బాధయగుం, గ్రోధిగాదపస్వికి జన్నే?

క్రోధము తపస్సును చెడగొట్టును. తపము నిలముగానొనరించును. క్రోధము అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశత్వమనెడి గుణములను పారద్రోలును. కోధము ధర్మకార్యములకు బాధ కలిగించును కావున తపస్వియగు వాడు కోధమును కలిగి యుండరాదు.

ఈ భావము తప్పక సుమతికారుడికి ప్రేరణగా తోస్తుంది. అయితే పై పద్యము ఉన్నదున్నట్లుగా కాక, క్రోధ దుష్ఫలితాలు మాత్రమే కవికి ప్రేరణ ఐనట్లుగా తోస్తున్నయి,.

"తనకోపమె తన శత్రువు తనశాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!"

కుమార సంభవములో నన్నె చోడుడు వెలయాలిని గూర్చి చెప్పిన ఒక పద్యము చూడండి.

"ఇలబుట్టదు, పుట్టియుదానిలువదు ,నిలిచియును నొక్కనిజమున దిరమై
కలదాక నెయిదనేరదు వెలయాండుర కలుపు మగల విడుపును సతులన్"

సుమతి శతకములో వెలయాలిని గూర్చిన చెప్పిన పద్యము చూడండి.

"వెలయాలి వలన కూరిమి గలుగదు మరికలిగెనేని కడతేరదయా

పలువురు నడిచేతెరువున పులుమొలవదు మొలిచెనేని పొందదు సమతీ!"

బద్దెన రచించిన "నీతి శాస్త్రముక్తావళి" లో ఈ పద్యమును చూడండి.

"సుతుకడకు తనకూర్చిన సతికడకును వేల్పుకడకు సద్గురుకడకున్
బతి కడకు రిత్త చేతుల మతిమంతుల నగజనదు మహిబద్దెనృపా!"
"నయమన్న పాల్ద్రావరు భయమన్ననమేధ్యమైన భక్షింతురు ,నా
భయము నయములోపల భయమే నయమండ్రు బుధులు బద్దె నరేంద్రా!"

బద్దెన రచించాడని చెప్పబడుచున్న సుమతి శతకములోని పద్యాలను చూడండి. అయితే సుమతి శతక కర్త, నీతి శాస్త్రముక్తావళి కర్త వేరువేరు అంటారు. ఒక్కరు కూడా కావచ్చు.

***<u>సుమతి పద్యాలు చూడండి.</u>***

"పతికడకు తన్ను గూర్చిన సతికడకున్ వేల్పుకడకున్ సద్గురు కడకున్
సుతుకడకు రిత్త చేతుల మతి మంతులు చనరు నీతిమార్గము సుమతీ!"
"నయమన్న పాల్ద్రావరు భయమన్ననమేధ్యమైన భక్షింతురుగా
నయమెంతదోసకారియె భయమే చూపంగ వలయు ప్రజలకు సుమతీ!"

రెండవ పద్యమును గమనిస్తే, ఆధునిక మానసిక శాస్త్ర సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తోస్తుంది.

నన్నెచోడుని కుమారసంభవములో ఒక పద్యమును చూడండి

"బలహీనులయ్యు నేమగు బలువురు దమలోన గూడి బలయుని నైనన్
గెలుతురు సూడగ నీహారలవంబులగూడి తీవ్ర రశ్మిని గుప్పున్!"

ఇల్లాంటి పద్యమే సుమతికర్త చెప్పినది ప్రసిద్ధమైనది.

"బలవంతుడనాకేమని పలువురితో నిగ్రహించి పలుకుటమేలా
బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ!"

శివదేవయ్య రచించిన శివదేవ ధీమణి మకుటము కలిగిన శతకములోని ఒక పద్యమును చూడండి.

"ప్రాణునపాను గూర్చియలపాము గదిల్చితదూర్ధకలితో
డ్యాణమునొత్తిమేన్ముధుడమై నిగుడంబిగియించి దృష్టులం
ఘోణము చేర్చి యా ప్రణవ ఘోషనమున్విని యందు మానస
క్షీణముసేసినం బసవ సిద్ధుడనా శివదేవ ధీమణి"

ఈ పద్యాన్ని తిక్కనగారు అనుసరించారని నిడదవోలు వెంకట్రావుగారి అభిప్రాయాన్ని ఆరుద్రగారు తన సమగ్రాంధ్ర సాహిత్యములో తెలిపారు.

"ప్రాణునపానునందును నపానుని బ్రాణునియందు నిల్పి ని
ర్వాణము గోరిచిత్తము తిరంబుగ బట్టగ బ్రాణ సమ్యమా
క్షీణత దేహ మధ్య శిఖి జిమ్మగ దత్తయమొంది మూ ర్ఛపా
రీణత గోర్కి సల్పున పరిచ్యుతి దగ్గతుడైన యోగికిన్!"

ఐతే ఈ రెండు పద్యాల కాలాలని బట్టి ఎవరు ఎవరిని అనుసరించారో తెలుసుకోవాలి.

మార్కండేయ పురాణము తొలితెలుగు పురాణము మారన రచించాడు.. (1295-1326) ఇందులో అనేకమైన నీతులున్నాయి. సుమతికారుడి పద్యాన్ని పోలిన ఈ పద్యమును చూడండి.

"ఎచ్చట శ్రోత్రియుడును ధనమిచ్చునతడు నీరుగలుగునేరు వెజ్జున్
మచ్చికయును లేకుండును నచ్చట వసియింపవలవదభినుతచరితా!"

సుమతి పద్యము చూడండి-"అప్పిచ్చువాడు వైద్యుడు నెప్పుడు ప్రవహించునట్టి యేరును ద్విజుడుం
జొప్పడిన యూరనుండుమచొప్పడకున్నట్టి యూరుజొరకుము సుమతీ!"

మార్కండేయ పురాణములోని మూలశ్లోకము చూడండి.

"ధనకశ్రోతియోరాజానదీ వైద్యా స్తు పంచమః పంచయత్రన విద్యంతేన తత్రదివసం వసేత్".

18 వశతాబ్దములో గంగమ్మగారి నరసింహము రచించిన కృష్ణ శతకము చాలా ప్రసిద్ధమైనది.

"హరియను రెండక్షరములు ,హరియించును పాతకములంభుజనాభా
హరి! నీ నామమహత్వము ,హరిహరి పొగడగ వశమె హరి శ్రీకృష్ణా"

ఎఱ్ఱనగారి నృసింహ పురాణములోని ఈ పద్యము,పై పద్యానికి ఆధారము.

"హరియను రెండక్కరములు,దొరకొనదీపొసగు జిహ్వాతుదినెవ్వనిక
న్నరుడొకడిభ్యుడు భవసాగర విస్తరణ ప్రకార కౌశలమునకున్!"

కూచిరాజు ఎర్రన తన సకలనీతికథానిధానము లో సుమతి కర్తను అనుకరించాడు.

"తేలునకు తోకవిషమగు ................. ఖలునకును విషము కాయంబెల్లన్"
సుమతి పద్యము..తలనుందు విషము ఫణికిని వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్
తలతోకయనకనుండును ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!'

ఎర్రన వ్రాసిన మరొక పద్యము

"తమవారి బాసిననుత్తమ మిత్రుండైన మిగులదాపము సేయున్
గమలంబు నీటబాసిన కమల్దాబాజీని వేడి చేత కమలినభంగిన్"

సుమతి పద్యము,

"కమలములు నీటబాసిన కమలాత్ముని రశ్మిసోకి కమలిన భంగిన్
దమతమ నెలవులు దప్పిన దమ మిత్రులె శత్రులౌట తథ్యము సుమతీ!"

హరిభట్టు రచించిన వరాహపురాణము రచించాడు. అతడి ఒక పద్యము సుమతి పద్యాన్ని పోలిఉంది. చూడండి.

"చీమలు పెట్టినపుట్టల బాములు సుఖియించినట్లు పరమజ్ఞానుల్
ప్రేమంబున బరగృహమున వేమరు సుఖియింతురధికవిభవముతోడన్"

గట్టుశేషయ్య తన కుచేలోపాఖ్యానములో, కార్యేషుదాసి సంస్కృత శ్లోకాన్ని అనువదించాడు.

"పనులు సేయునెడబానిసవలె,బుద్ధిగరుపునెడ్రబధాన కరణి ,భోజనంబులిడెడి యెడలనంబకైవడి ..

సుమతి పద్యమును చూడండి..

"పనిచేయునెడల దాసియు ననుభవమున రంభ ,మంత్రియాలోచనలన్
దనభుక్తియెడల దల్లియు, యనదగుకులకాంతయుండనగురాసుమతీ!"

యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకములోని పద్యము.

ఏయేవేళలనే వయస్సున నరుండేభూమినేయూరిలో
నేయేకర్మమునాచరించునశుభంబేనిన్ శుభంబేనిదా
నాయావేళల నావయస్సున నతుండాభూమి నాయూరలో
నాయాకర్మంబులెల్లనగుదధ్యబింత సర్వేశ్వరా!

పారిజాతాపహరణములోని నందితిమ్మనగారి ఈ పద్యముచూడండి. పై పద్యానికి ఇది బింబ ప్రతిబింబముగా తోస్తుంది.

ఏయే వేళలనే సఓజముఖి యేయేలీలలంగోరుదా
నాయావేళల నాసరోజముఖి నాయాలీలలంతేల్చియే
చాయంజూచిన దానయ్యై మెలగుచున్ సౌఖ్యాబ్ధినోలలాడు భో
గాయత్తుండయి పెక్కు రూపములమాయాకల్పనాచాతురిన్"

పై పద్యాలు స్థూలంగా శతకకారులు ఇతరులనుండి అనుసరించినవియే ఐనప్పటికీ, అక్కడక్కడా శతకకారులను ఇతరులు అనుసరించినవి యున్నవి. యే పద్యాన్ని ఎవరు అనుసరించినా, ఆ పద్యాలన్నీ ఆణిముత్యాలే కావడము విశేషము.

Post your comments